సాక్షి అనకాపల్లి

ఆదివారం । 26 । మార్చి । 2023



కౌన్సిల్ హాల్లో మేయర్లు

విశాఖ: జీవీఎంసీ కౌన్సిల్ హాల్లో మేయర్ల ఫొటోలు ఏర్పాటు చేశారు. తొలి మేయర్ నుంచి మొత్తం ఆరుగురి ఫొటోలు ఉన్నాయి.



పోస్టర్ ఆవిష్కరణ

విశాఖ: స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో నిర్వహించే సంబరాల పోస్టర్లను డీఈవో చంద్రకళ ఆవిష్కరించారు.



జి-20 పనుల పరిశీలన

విశాఖ: జి-20 సదస్సు నేపథ్యంలో విశాఖలో వివిధ అభివృద్ధి పనులను మంత్రి ఆదిమూలపు సురేష్ శనివారం పరిశీలించారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (ఆది)	సహర్ (సోమ)
అనకాపల్లి	6-12	4-42
నర్సీపట్నం	6-16	4-41

తాబేలుకు ప్రాణం పోశారు..

- ఒడ్డుకు వచ్చిన సమయంలో కుక్కల దాడి
- స్థానికుల సమాచారంతో స్పందించిన వైద్యుడు
- శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన వైనం



కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ తాబేలు



తాబేలుకు ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యుడు శివకుమార్



ఆపరేషన్ తరవాత తాబేలు

బుచ్చెయ్యపేట: కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డ తాబేలుకు ఆపరేషన్ చేసి ఓ వైద్యాధికారి జీవం పోశారు. స్థానిక యువకులు సకాలంలో స్పందించడంతో ఒక మూగ జీవి ప్రాణం నిలబడింది. వివరాలు.. వడ్డాది పెద్దేరు నదిలో తాబేళ్లు సంచరిస్తూ ఉంటాయి. శనివారం తాబేలు ఒకటి గుడ్లు పెట్టడానికి ఒడ్డుకు వచ్చింది. అక్కడే ఉన్న వీధి కుక్కలు దానిపై దాడి చేశాయి. తీవ్రంగా గాయపడ్డ తాబేలు పేగులు బయటకు వచ్చేయడంతో విలవిల్లాడింది. ఈ విషయం గమనించిన స్థానిక యువకులు దగ్గర్లోనే ఉన్న ప్రభుత్వ పశువైద్యాధికారి శివకుమార్‌కు ఈ విషయం తెలిపారు. వెంటనే స్పందించిన వైద్యుడు తాబేలును ఆస్పత్రికి తీసుకొచ్చి వైద్య సేవలు అందించారు. ఆధునిక పద్ధతిలో శస్త్రచికిత్స నిర్వహించి ప్రాణాలు కాపాడారు. తీవ్ర గాయాలైన మూగజీవికి ఆపరేషన్ చేసి ఆదుకున్నందుకు వైద్యుడు శివకుమార్‌ను స్థానికులు అభినందించారు.

ఎగిరిపోతే ఎంత బాగుంటుంది..



రెక్కలు కట్టుకుని ఆకాశంలో ఎగురుతూ భూమి పై ఉన్న ప్రకృతి అందాలను చూడాలని ఎవరికి ఉండదు చెప్పండి. అయితే అది సాధ్యమా అంటే పారా గ్లైడింగ్ రూపంలో అవుననే సమాధానం మీ ముందు ఉంటుంది. ఈ పారా గ్లైడింగ్ ద్వారా కొంచెం ధైర్యం చేస్తే ఆకాశంలో పక్షులతో పోటీపడి ఎగురుతూ భూమి పై అందాలను చూడవచ్చు. సాగరతీరం సొగసునూ వీక్షించవచ్చు. జీ-20 సదస్సు నేపథ్యంలో ఆ అదృష్టం విశాఖ వాసులకు దక్కింది. సాగరతీరంలో పారా గ్లైడింగ్‌ను అందుబాటులోకి వచ్చింది. శనివారం తీరానికి వచ్చిన సందర్శకులు పారా గ్లైడింగ్‌లో సముద్ర అందాలను చుట్టివచ్చారు.

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు)

న్యూస్‌రీల్

అపజయాలకు వెనుకాడొద్దు

- ఐఐటీ ప్రొఫెసర్ అనిల్‌కుమార్



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రొఫెసర్ అనిల్‌కుమార్

మాకవరపాలెం: అపజయాలకు వెనుకడుగు వేయొద్దని తిరుపతి ఐఐటీ మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ అనిల్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో స్పార్క్స్ పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించిన సాంకేతిక సదస్సులు శనివారంతో ముగిశాయి. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విషయ పరిజ్ఞానంతోపాటు ప్రయోగాత్మక జ్ఞానంతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్లు రవికుమార్, ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నమైన ప్రాజెక్టులు రూపొందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలకు బాట వేస్తాయన్నారు. పలు ఈవెంట్లలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు.

రేపు పీఎఫ్ అదాలత్

అనకాపల్లి టౌన్: స్థానిక పూడిమడక రహదారి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ప్రజారవాణాశాఖ (ఆర్టీసీ) జిల్లా కార్యాలయంలో ఈనెల 27న పీఎఫ్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విశాఖ రీజనల్ పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.వి.కృష్ణమోహన్ శనివారం పేర్కొన్నారు. ప్రభుత్వ/ప్రైవేట్ సంస్థలో పనిచేస్తూ పీఎఫ్ సభ్యత్వం కలిగిన ఉద్యోగుల సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవగాహన సదస్సులో సభ్యత్వం కలిగిన ఉద్యోగుల ఫిర్యాదులు స్వీకరించి, వారి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

దిలీప్‌కుమార్‌కు మంత్రి అమర్‌నాథ్ పరామర్శ



అనకాపల్లి టౌన్: అస్వస్థతకు గురై విశాఖలోని ప్రైవేట్ ఆస్పత్రితో చికిత్స పొందుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్‌ను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ శనివారం పరామర్శించారు. దిలీప్‌కుమార్ ఆరోగ్య పరిస్థితి గురించి, అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

నేడు భాగవతంపై చాగంటి ప్రవచనం

అనకాపల్లి టౌన్: స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు 'భాగవతం' అనే అంశంపై ప్రవచనం చేస్తారని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాండ్రేగుల విష్ణుమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమం ఆదివారం సాయంత్రం 6 గంటలకు మొదలవుతుందని పేర్కొన్నారు.

రూ.4,063.49 కోట్లతో మహా బడ్జెట్



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు



సభలో బడ్జెట్ ప్రవేశపెడుతున్న మేయర్ హరి వెంకటకుమారి

- అంచనాల బడ్జెట్ ఆమోదం
- వచ్చేదంతా జనరంజక పాలనే అన్న అధికార పార్టీ
- అంకెల గారడీయే అన్న ప్రతిపక్షాలు

దాబాగార్డెన్స్ : మహా విశాఖ నగర పాలక సంస్థ 2023–24 ఏడాదికి రూ.4,063.49 కోట్లతో బడ్జెట్ అంచనా వేసింది. మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన శనివారం జీవీఎంసీ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్పొరేటర్ల వాదోపవాదాల అనంతరం బడ్జెట్‌ను ఆమోదిస్తున్నట్టు కోరం ప్రకటించింది.

పన్నుల రూపంలో వచ్చే ఆదాయం

2022–23 ఏడాదికి ఆశించిన జమ కన్నా 2023–24 ఏడాదికి ఆశించిన జమల్లో రూ.24,526.50 లక్షలు పెరుగుదల ఏర్పడింది. జీవీఎంసీ వసూలు చేస్తున్న ఇంటి పన్ను, ఖాళీ జాగా పన్ను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సర్వీసు చార్జీలు, స్టీల్‌ప్లాంట్, పోర్టు తదితర పారిశ్రామిక సంస్థలు చెల్లించాల్సిన పన్నులు, సర్వీస్ చార్జీలు, ప్రకటన చార్జీలు, సెల్ టవర్స్ చార్జీలు, జంతువులపై పన్నులు ఈ పద్దు కింద బడ్జెట్లో చూపారు. 2023–24 ఏడాదికి బడ్జెట్ అంచనాల్లో రూ.58,103.50 లక్షలు, 2022–23 ఏడాదికి సంబంధించిన అంచనాల్లో రూ.56,527.50 లక్షలు పన్నులు రూపేణా ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

పన్నులు కాని ఇతర ఆదాయాలు

నీటి సరఫరా చార్జీలు, పట్టణ ప్రణాళికా విభాగం వసూళ్లు, దుకాణాల అద్దెలు, కల్యాణ మండపాల అద్దెలు, లీజులు, బల్క్, సెమీబల్క్, ఇతర నీటి సరఫరా చార్జీలు, వ్యాపార సంస్థల లైసెన్స్ ఫీజులు వంటివి ఆదాయాలుగా బడ్జెట్‌లో పొందుపరిచారు. 2023–24 ఏడాదికి రూ.92,090 లక్షలు, 2022–23 ఏడాదికి సవరించిన అంచనాల్లో రూ.84,906 లక్షల ఆదాయాన్ని ఈ పద్దుల కింద రావొచ్చని అంచనా వేశారు.

ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయం

స్టాంప్ డ్యూటీపై సర్‌చార్జ్, వృత్తిపన్ను, తలసరి గ్రాంటు, మోటారు వాహనాల పన్ను, ఆస్తిపన్ను రాయితీ, నష్టపరిహారాలు, మెజిస్ట్రీరియల్ జరీమానాలు వంటివి ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయంగా బడ్జెట్‌లో చూపారు. ఆయా పద్దుల కింద 2023–24 ఏడాదికి రూ.22,610 లక్షలు, 2022–23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.21,610 లక్షలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

2023-24 బడ్జెట్ ఇలా..

ప్రారంభ నిల్వ	రూ.480.58 కోట్లు
ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం ఆదాయం	రూ.4,303.21 కోట్లు
అన్ని పద్దుల కింద ఖర్చులు	రూ.4,063.49 కోట్లు
ముగింపు నిల్వ	రూ.239.72 కోట్లు

ప్రభుత్వ గ్రాంట్లు

పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి 2023–24 బడ్జెట్ అంచనాల్లో రూ.650 లక్షలు, 2022–23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.500 లక్షలు వచ్చే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి 15వ ఆర్థిక సంఘం కోసం 2023–24 ఏడాదికి బడ్జెట్ అంచనాల్లో రూ.27,600 లక్షలు, 2022–23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.16,700 లక్షలు రావొచ్చని అంచనా వేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అమృత్ కోసం 2023–24 ఏడాదికి రూ.15 వేల లక్షలు, 2022–23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.2,400 లక్షలు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఆసియా అభివృద్ధి బ్యాంకు నుంచి ఇతర నిధులతో ప్రాజెక్టుల కోసం 2023–24 ఏడాదికి అంచనాలలో రూ.19,120 లక్షలు, 2022–23కి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.11,975 లక్షలు వచ్చే అవకాశం ఉంది.

2023–24 ఏడాదికి ఖర్చుల అంచనా

మంచినీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు, ఫ్లై ఓవర్లు, కాలువలు, భూగర్భ డ్రైనేజీ, పార్కులు, భవనాలు, కల్యాణ మండపాలు, స్టేడియంల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, అన్ని వార్డుల్లో చేపట్టాల్సిన పనుల ప్రతిపాదనల అమలుకు వివిధ పద్దుల కింద బడ్జెట్ కేటాయించారు. 2023–24 అంచనాలలో అన్ని పద్దుల కింద రూ.4,06,349 లక్షల ఖర్చు అంచనా వేయగా, 2022–23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.3,57,736 లక్షలు ఖర్చు కాగలదని అంచనా వేశారు. గతంలో చేపట్టి పూర్తికాని పనులకు, ప్రస్తుత సంవత్సరంలో మంజూరైన పనులకు, జరుగుతున్న పనులకు సవరించిన అంచనాల్లోనూ, బడ్జెట్ అంచనాల్లోనూ కేటాయింపులు చేశారు.

ఆధునిక విద్యుదీకరణ

నగరంలో ప్రధాన, సాధారణ రహదారుల్లో ఆధునిక విద్యుదీకరణకు రూ.800 లక్షలు, వీధి దీపాల నిర్వహణకు రూ.1,500 లక్షలు, పార్కుల విద్యుదీకరణ, నిర్వహణకు రూ.4వేల లక్షలు కేటాయించారు.

మంచినీటి సరఫరా

నగరంలోని మంచినీటి సరఫరా పథక నిర్వహణకు రూ.3వేల లక్షలు, మంచినీటి సరఫరా పైపులైన్ విస్తరణకు రూ.750 లక్షలు, గొట్టపు బావులు వేసేందుకు, వాటి నిర్వహణకు రూ.850 లక్షలు, రిజర్వాయర్ల నిర్మాణం, నిర్వహణకు రూ.850 లక్షలు కేటాయించేందుకు ప్రతిపాదించారు. ముడసర్లోవ రిజర్వాయర్, పార్కు అభివృద్ధికి రూ.8 వేల లక్షలు ప్రతిపాదించారు.

ఆర్థిక సంఘం నిధులు

14వ ఆర్థిక సంఘం నిధుల పనుల కోసం సవరించిన బడ్జెట్‌లో రూ.2,100 లక్షలు, 2023–24 ఏడాదికి రూ.550 లక్షలు ప్రతిపాదించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల పనుల కోసం సవరించిన బడ్జెట్‌లో రూ.16,700 లక్షలు, 23–24 ఏడాదికి రూ.27,600 లక్షలు ప్రతిపాదించారు.

ఎస్సీ, ఎస్టీ,, స్త్రీ, శిశు సంక్షేమ అభివృద్ధికి..

జీవీఎంసీ పరిధిలో షెడ్యూల్డ్ కులాలకు 15 శాతం, షెడ్యూల్డ్ తెగలకు 7.5 శాతం, స్త్రీ, శిశు సంక్షేమానికి 5 శాతం అభివృద్ధి పనులకు కేటాయించిన నిధుల్లో మొత్తం 27.5 శాతం తగ్గకుండా 23–24 ఏడాదికి 13,351.39 లక్షలు, సవరించిన బడ్జెట్‌లో 12,149.91 లక్షలు కేటాయించారు.

ఎంపీటీసీ, సర్పంచ్ ఉప ఎన్నికలకు రంగం సిద్ధం

- ఆర్వోలు, ఏఆర్వోల నియామకం
- ఇప్పటికే ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్‌ల ప్రచురణ
- 8 ఎంపీటీసీలకు, 2 సర్పంచ్ స్థానాలకు త్వరలో ఎన్నికలు

నక్కపల్లి: జిల్లాలో వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన ఎంపీటీసీ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, ఎన్నికల సంఘం చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నాయి. ఇప్పటికే ఈ సెగ్మెంట్లలో ఓటర్ల జాబితా తయారు, ముసాయిదా ప్రకటన, పోలింగ్ బూత్‌ల ఎంపిక, అభ్యంతరాల స్వీకరణ వంటి ప్రక్రియలు పూర్తయ్యాయి. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ సెగ్మెంట్‌లకు రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ జాబితాను ఎన్నికల సంఘం ఆమోదానికి పంపించినట్లు అధికారులు తెలిపారు. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో 8 ఎంపీటీసీ సెగ్మెంట్లకు, 2 సర్పంచ్ స్థానాలకు ఉప ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. నక్కపల్లి మండలం దేవవరం, ఎస్.రాయవరం మండలం ఉప్పరాపల్లి, పాయకరావుపేట మండలం వెంకటనగరం, మునగపాక మండలం మెలిపాక, నర్సీపట్నం మండలం ధర్మసాగరం, మాకవరపాలెం మండలం పైడిపాల, బుచ్చెయ్యపేట మండలం బుచ్చెయ్యపేట, అనకాపల్లి మండలం కుంచంగి ఎంపీటీసీ స్థానాలు వివిధ కారణాల వల్ల ఖాళీ అయ్యాయి. అలాగే బుచ్చెయ్యపేట, ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది.

ఆర్వోలు, ఏఆర్వోలు వీరే..

నక్కపల్లి మండలానికి ఆర్వోగా కె.రమామణి(ఎస్‌డీసీ), ఏఆర్వోలుగా సీతారామరాజు (ఎంపీడీవో), నీరజ (తహసీల్దార్), పాయకరావుపేట మండలానికి ఆర్వోగా లచ్చన్న (అగ్రికల్చర్ డీపీఎం) ఏఆర్వోలుగా సాంబశివరావు (ఎంపీడీవో) జయప్రకాష్ (తహసీల్దార్), ఎస్.రాయవరానికి ఆర్వోగా పి.లక్ష్మీపతి (డీఆర్‌డీఏ పీడీ), ఏఆర్వోలుగా ఎన్వి రామచంద్ర (ఎంపీడీవో), శ్యామ్‌కుమార్ (తహసీల్దార్), మునగపాకకు ఆర్వోగా మంజులావాణి (అనకాపల్లి డీఎల్‌డీవో) ఏఆర్వోలుగా రవికుమార్ (ఎంపీడీవో) వినయ్‌కుమార్ (తహసీల్దార్), నర్సీపట్నానికి ఆర్వోగా మోహన్‌రావు (అగ్రికల్చర్ జేడీ), ఏఆర్వోలుగా జయమాధవి (ఎంపీడీవో), అన్నాజీరావు (తహసీల్దార్), మాకవరపాలేనికి ఆర్వోగా సిహెచ్.ఆర్.వి.రమేష్ (ఆర్అండ్‌బీ ఈఈ), ఏఆర్వోలుగా అరుణశ్రీ (ఎంపీడీవో), ఎం.వి.వి.ప్రసాద్ (తహసీల్దార్), బుచ్చెయ్యపేటకు ఆర్వోగా పి.ఎల్.ఎస్.కిరణ్‌కుమారి (డీసీవో), ఏఆర్వోలుగా సువర్ణరాజు (ఎంపీడీవో), అంబేడ్కర్ (తహసీల్దార్), అనకాపల్లికి ఆర్వోగా వీరన్న నాయుడు (పీఆర్ ఈఈ), ఏఆర్వోలుగా ధర్మారావు (ఎంపీడీవో), గంగాధర్ (తహసీల్దార్)లను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆసరా రూ.276.77 కోట్లు



స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కును అందిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ సత్యవతి



మాకవరపాలెం మండలం తామరంలో సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

- 34,935 స్వయం సహాయక సంఘాలకు మూడో విడత రుణమాఫీ
- 3,63,346 మంది మహిళలకు ప్రయోజనం

తుమ్మపాల: స్వయం సహాయక సంఘాల రుణమాఫీలో భాగంగా వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడో విడతగా జిల్లాలో 34,935 సంఘాల ఖాతాల్లో రూ.276.77 కోట్ల ఆసరా నిధులు జమ అయ్యాయని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి చెప్పారు. ఆయా సంఘాల్లోని 3,63,346 మంది సభ్యులకు లబ్ధి చేకూరిందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఏలూరులో జరిగిన వైఎస్సార్ ఆసరా పంపిణీ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయనతోపాటు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి కలెక్టరేట్‌లో వీక్షించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు చెక్కును అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా కింద జిల్లాలో మూడు విడతల్లో రూ.821.47 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. మొదటి విడతలో 34,686 సంఘాల సభ్యులకు రూ.270.54 కోట్లు, రెండో విడతలో 34890 సంఘాల సభ్యులకు రూ.274.16 కోట్లు జమ చేశామన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ మహిళాభివృద్ధితోనే రాష్ట్రం పురోగమిస్తుందనే సంకల్పంతో ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాల్లో మహిళలను భాగస్వాములు చేస్తున్నారని చెప్పారు. ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు చేపట్టిన 'పేదలందరికీ ఇల్లు పథకం'లో పట్టాలను కూడా మహిళల పేరునే మంజూరు చేశారన్నారు. ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి మహిళల పక్షపాతి అని, వారికి అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఆర్థికంగా ఎన్ని ఒడుదొడుకులు ఎదురైనప్పటికీ మహిళల విషయంలో మాత్రం వెనకడుగు వేయకుండా వారిని ఆదుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, మెప్మా పీడీ సరోజిని, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రూ.12 కోట్లతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు



మాట్లాడుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

మంత్రి గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్: వేసవి కాలంలో అనకాపల్లి మండలంలో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని పరిశ్రమలు, వాణిజ్య, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. అంతకు ముందు రూ.10 లక్షలతో ఆధునికీకరించిన మండల పరిషత్ కార్యాలయం వద్ద శిలాఫలకాన్ని మంత్రి అమర్‌నాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని, మరికొన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. గ్రామాలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.12 కోట్లతో జల్ జీవన్ మిషన్ ద్వారా మూడో విడత ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో జగనన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అర్హత కలిగిన నిరుపేదలకు 90 రోజుల్లో ఇళ్ల మంజూరు చేయాలన్నారు. సొంత స్థలం ఉండి గృహాలు నిర్మించుకోలేని నిరుపేదలకు ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందజేస్తుందన్నారు. వచ్చే నెల మొదటి వారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫిజిషియన్ వైద్యం పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నారని తెలిపారు. నాడు–నేడులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మిగిలిన పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో రూ. 4.86 కోట్లతో ఇరిగేషన్ విభాగంలో (గ్రోయిన్ మరమ్మతులు నిమిత్తం) పలు అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సీఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు. రూ.32 కోట్లతో కేబీ రహదారి విస్తరణ పనులు చేస్తున్నామని, బవులవాడ – చోడవరం రహదారి విస్తరణ పనులు త్వరలో ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావు, పంచాయతీరాజ్ డీఈ వేణుగోపాలరావు, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, ఐతా రాము తదితరులు పాల్గొన్నారు.

ఆటో- ద్విచక్రవాహనం ఢీ

- 8 మందికి గాయాలు
- జి. భీమవరం వద్ద ఘటన



జి.భీమవరం వద్ద ప్రమాదానికి గురైన ఆటో



ప్రమాదంలో తీవ్రంగా పడిన రాజేష్



అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ నానాజీ భార్య దుర్గ

కశింకోట: మండలంలోని జి. భీమవరం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన ముగ్గుర్ని విశాఖ కేజీహెచ్‌తోపాటు ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానికులు, బాధితుల కథనం మేరకు.. నర్సీపట్నం నుంచి అనకాపల్లి వైపు వస్తున్న ఆటో ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొన్నాయి. దాంతో ఆటో అదుపు తప్పి అవతలి రోడ్డు వైపు దూసుకుపోయి స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. బైక్ నడుపుతున్న మాకవరపాలెం మండలం పైడిపాలకు చెందిన కె. రాజేష్, తాళ్లపాలెం వద్ద లిఫ్ట్ అడిగి బైక్ వెనుక కూర్చున్న జి. భీమవరానికి చెందిన అల్లం సతీష్, ఆటోలో ప్రయాణిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా రాజవొమ్మంగి మండలం సూరంపాలెం గ్రామానికి చెందిన డి.గంగ, ఆటో డ్రైవర్ ఒ.నానాజీ, అతడి భార్య దుర్గ, కుమారుడు భానుచంద్ర, కుమార్తె ఉమాదేవి, కన్నూరుపాలెం గ్రామానికి చెందిన ప్రయాణికులు ఎ. కుమారి, రామలక్ష్మి గాయపడ్డారు. వీరిని 108 వాహనంలో స్థానికుల సహాయంతో అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్రంగా గాయపడిన రాజేష్‌ను కేజీహెచ్‌కు, సతీష్, గంగలను ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారిలో ముగ్గురు అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇద్దరు చికిత్స చేసుకుని ఇంటికి వెళ్లిపోయారు. సూరంపాలెం నుంచి తమ కుటుంబ సభ్యులను ఆటో డ్రైవర్ నానాజీ విశాఖ స్టీల్‌ప్లాంట్ వద్ద వడ్లపూడికి తీసుకెళ్తుండగా ఈ ప్రమాదానికి గురై ఆస్పత్రి పాలయ్యారు. తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహనచోదకుడు బయ్యవరం వద్ద ప్రైవేటు డెయిరీలో పని చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందింది.

మామిడి, జీడి దిగుబడి తగ్గడంపై అధ్యయనం

జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు



రైతులతో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు

కె.కోటపాడు: హుద్‌హుద్ తుఫాన్ సమయం నుంచి మామిడి, జీడి పంట దిగుబడి తగ్గడంపై కొండెంపూడి వ్యవసాయ పరిశోధనా క్షేత్రం శాస్త్రవేత్తలతో అధ్యయనం చేయనున్నట్లు జిల్లా ఉద్యానవన శాఖాధికారి ప్రభాకరరావు తెలిపారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి సూచనల మేరకు మండలంలోని పాతవలస, సూదివలస, మర్రివలస గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. నీరు అందుబాటులో లేకపోవడంతోపాటు పూతదశలో మంచు తీవ్రత వల్ల పంట దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది జూన్ నుంచి మామిడి, జీడి సాగు రైతులతో విరివిగా ఉద్యానవన శాఖాధికారులతో సాగు సూచనలను ఇప్పించే చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుత సమయంలో మామిడి తెగుళ్ల నుంచి పంటను రక్షించేందుకు ఇమిడాక్లోప్రిడ్ 3 ఎంఎల్ మందును లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు మార్లు పిచికారీ చేయాలని సూచించారు. కోతకు 15 రోజుల ముందు కార్బండిజమ్ ఒక గ్రామును లీటరు నీటిలో కలిపి పంటకు పిచికారీ చేస్తే కాయకుళ్లు, కాయ మచ్చ కుళ్లు అరికట్టవచ్చునని పేర్కొన్నారు. భార్గవ్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ చైర్మన్ లాలం అచ్చుంనాయుడు, ఆర్బీకే ఉద్యానవనశాఖ సహాయకురాలు అనూష పాల్గొన్నారు.

బాధిత పోలీసు కుటుంబానికి వెల్ఫేర్ ఐజీ పరామర్శ



సన్యాసిరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఐజీ రంగారావు

కె.కోటపాడు: ఇటీవల భీమిలి బీచ్‌రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ సన్యాసిరావు కుటుంబాన్ని పోలీస్‌శాఖ వెల్ఫేర్ ఐజీ కె.వి.రంగారావు శనివారం పరామర్శించారు. మృతుడు సన్యాసిరావు స్వగ్రామమైన జోగన్నపాలెంలో ఆయన ఇంటికి వెళ్లిన ఐజీ రంగారావు ఆయన భార్య, కుటుంబ సభ్యులతో మాట్లాడి వారిని ఓదార్చి సంతాపాన్ని ప్రకటించారు. పోలీస్‌శాఖ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, శాఖాపరంగా అందాల్సిన అన్ని సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తాతారావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణరావు, ఎస్ఐ ఆర్.ధనుంజయ్ ఉన్నారు.

ఏలేరు కాలువలో గాలింపు చర్యలు

అనకాపల్లి టౌన్: మండలంలోని బొజ్జన్నకొండ ఏలేరు కాలువలో గుర్తుతెలియని వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్టు పట్టణ సీఐ దాడి మోహనరావు శనివారం తెలిపారు. మండలంలో తుమ్మపాల ఏలేరు కాలువ వద్ద ద్విచక్రవాహనం, చెప్పులు ఉన్నాయని స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక అధికారులతో సహాయంతో కాలువలో గాలింపు చర్యలు ప్రారంభించామన్నారు. వాహనం నంబరు ఆధారంగా దర్జీనగర్‌కు చెందిన వ్యక్తిగా భావిస్తున్నామని పేర్కొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి: ధర్మశ్రీ



చోడవరం బార్ నూతన కార్యవర్గాన్ని సత్కరించిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. చోడవరం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులంతా కొత్త అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో శనివారం ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని ధర్మశ్రీ శాలువాలతో ఘనంగా సత్కరించారు. కొత్త కార్యవర్గం బార్ సంక్షేమానికి మరింతగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే న్యాయవాదులకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. పార్టీ నాయకులు బొడ్డేడ సూర్యనారాయణ, శరగడం చిమ్మినాయుడు, కురుకూటి భోగేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నర్సీపట్నం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ఉత్సాహంగా జరిగింది. ఇక్కడ 1986 నుంచి 2019 వరకు చదివిన 80 మంది పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. వారంతా చదువులమ్మ ఒడిలో ఒకటయ్యారు. ఆనాటి మధురస్మృతులను నెమరువేసుకున్నారు. కొన్నేళ్ల తర్వాత కలవడంతో వారిలో ఆనందం వెల్లి విరిసింది. ఒకరి యోగక్షేమాలను ఒకరు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.వి.రామచంద్రరావు, అధ్యాపకులను సన్మానించారు. ఏటా సమ్మేళనం నిర్వహించేందుకు పూర్వ విద్యార్థులు కమిటీ ఏర్పాటు చేసుకున్నారు.

నర్సీపట్నం ఆస్పత్రిలో బాలింత మృతి



మృతి చెందిన బాలింత సీత

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ లోయలపాలెంకు చెందిన బాలింత విప్పల సీత(34) శనివారం సాయంత్రం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో మృతి చెందింది. సీతకు పురిటి నొప్పులు రావడంతో రాజేంద్రపాలెం ఆస్పత్రి నుంచి శనివారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆమె గర్భంలో ఇద్దరు శిశువులు ఉన్నారు. ముందు మగశిశువుకు జన్మనిచ్చింది. రెండో శిశువును ప్రసవిస్తుండగా ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తి మృతి చెందినట్టు ఆమె భర్త రాజారావు తెలిపారు. ఆమెకు ఇది ఐదో కాన్పు. సీత మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు రోదించారు.

ప్రయాణికుల కోసం సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): వేసవి ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు బారౌని–కొయంబత్తూర్–బరౌని మధ్య సమ్మర్ స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఏకే త్రిపాఠి ప్రకటనలో తెలిపారు. ఈ రైలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి 29వ తేదీ వరకు నడుస్తుందన్నారు.

క్లుప్తంగా

నేడు పక్షుల కోసం నీటి పాత్రల పంపిణీ

అనకాపల్లిటౌన్: గ్రీన్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటలకు స్థానిక నెహ్రూచౌక్‌లో పక్షుల కోసం మట్టి పాత్రలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషన్‌శ్రీధర్ శనివారం తెలిపారు. వేసవికాలంలో పక్షుల దాహార్తి తీర్చేందుకు కాసిన్ని నీళ్లు, ఆకలి తీర్చేందుకు గుప్పెడు గింజలు ఉంచాలి అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అన్ని వర్గాల ప్రజలు పక్షుల మనుగడను కాపాడాలన్నారు.

ఆశీల వసూలు నుంచి మినహాయించాలి

తుమ్మపాల:ఆకుకూరల వ్యాపారులను ఆశీల వసూలు నుంచి మినహాయించాలని కోరుతూ ఆమ్‌ఆద్మీ పార్టీ పట్టణ కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు కలెక్టర్ కార్యాలయంలో శనివారం వినతిపత్రం అందించారు. జీవీఎంసీ అనకాపల్లి పట్టణంలో ప్రధాన రహదారికి ఇరువైపులా రైతుల చిన్నచిన్న పోగులతో కూరగాయాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారని, రెక్కాడితే గాని డొక్కాడని వారిని ఆశీల చెల్లింపు నుంచి మినహాయించాలని కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



పరీక్ష సామగ్రి అందజేస్తున్న దృశ్యం

కశింకోట: అన్ని రంగాల్లో బాలికలు ముందంజలో ఉండడానికి కృషి చేయాలని అదనపు ఎస్ఐ జక్కుల నాగేశ్వరరావు కోరారు. స్థానిక సమగ్ర బాలికల వసతి గృహంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధు ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి కృషి చేయాలన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారి పి.నిర్మల, నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం జిల్లా అధ్యక్షుడు కోరిబిల్లి పరమేష్ పాల్గొన్నారు.

వర్షాలతో అవస్థలు

తుమ్మపాల: అనకాపల్లి మండలంలో కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ దెబ్బతింది. దీంతో సాయంత్రం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శనివారం 1,679 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,750	4,070
రెండో రకం	3,450	3,720
మూడో రకం	3,100	3,400

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-5 యూనిట్లు, ఎ నెగిటివ్-1 యూనిట్, బి పాజిటివ్-12 యూనిట్లు, బి నెగిటివ్-1 యూనిట్, ఒ పాజిటివ్ 8 యూనిట్లు, ఒ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(ఫోన్ నంబర్ 9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 349 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 326 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (ఫోన్‌నంబర్ 9441108144)ని సంప్రదించవచ్చు.

చురుగ్గా ఫీవర్ సర్వే

- ఇంటింటా వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది



ఫీవర్ సర్వే చేస్తున్న వైద్యసిబ్బంది

తుమ్మపాల: మొన్నటి వరకు చలి, ఇప్పుడు వర్షం కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పులతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా ఈ వేసవిలో వచ్చిన మార్పులతో వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీనికి తోడు దేశంలో హెచ్3ఎన్2 వైరస్ వ్యాప్తి నేపథ్యంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలతో వైద్య సిబ్బంది, ఆశా, హెల్త్ వర్కర్లు గ్రామాల్లో ఇంటింటా ఫీవర్ సర్వే చేపడుతున్నారు. ఈ సర్వేలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కూడా పాల్గొంటున్నారు. అనారోగ్యం పాలైన వారి వివరాలను సేకరిస్తున్నారు. వైద్య సిబ్బంది వద్ద గల యాప్‌లలో నమోదు చేసి ఎప్పటికప్పుడు రోగుల వివరాలను ప్రభుత్వానికి పంపుతున్నారు.

92 శాతం సర్వే పూర్తి

అనకాపల్లి మండలంలో 92 శాతం సర్వే పూర్తయినట్టు అధికారులు తెలిపారు. 32 గ్రామాల్లో 26 సచివాలయాల ద్వారా ఫీవర్ సర్వే జరుగుతోంది. పదిహేను రోజుల నుంచి నిర్వహిస్తున్న సర్వేలో జ్వరపీడితులను గుర్తించి తక్షణమే మందులు పంపిణీ చేస్తున్నారు. తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో అక్కిరెడ్డిపాలెం, చింతనిప్పుల అగ్రహారం, గొలగాం, గోపాలపురం, కోడూరు, రేబాక, శంకరం, మారేడుపూడి, మార్టూరు, పాపయ్యపాలెం, తుమ్మపాల గ్రామాల్లో 14,318 కుటుంబాలు ఉండగా, ఇప్పటికే 13,520 కుటుంబాల సంబంధించి సర్వే పూర్తి చేశారు. 2,440 మంది వివరాలను ఈ సంజీవని యాప్‌లో నమోదు చేశారు. తగరంపూడి పీహెచ్‌సీ పరిధిలో తగరంపూడి, బవులువాడ, వెంకుపాలెం, కూండ్రం, కుంచంగి, ఊడేరు, మామిడిపాలెం గ్రామాల్లో 9,502 కుటుంబాలుండగా 8,713 కుటుంబాల్లో సర్వే పూర్తి చేశారు. మిగిలిన కొత్తూరు, పిసినికాడ, సత్యనారాయణపురం, సంపతిపురం, సుందరయ్యపేట, బాటజంగాలపాలెం గ్రామాల్లో సర్వే జరుగుతోంది.

జ్వరాలపై ఆందోళన వద్దు



జ్వరాలపై అన్ని గ్రామాల్లోనూ సమగ్ర సర్వే చేస్తున్నాం. గత కొన్ని రోజులుగా గ్రామాల్లో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. జ్వరాల బారిన పడేవారి సంఖ్య రోజురోజుకీ తగ్గుతోంది. ఎక్కువ మందికి సాధారణ జ్వరాలు వచ్చాయి. మందులతో తగ్గుముఖం పట్టాయి. ఈ జ్వరాలు వాతావరణంలో మార్పులు కారణంగా వచ్చినవే. ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. అన్ని సచివాలయాల్లోను వైద్య సిబ్బంది వద్ద మందులను అందుబాటులో ఉంచాం.

– డాక్టర్ వాణి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారి

సమగ్ర సర్వేతో భూ వివాదాలకు చెక్

- అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

సబ్బవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా చేపట్టిన రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణలో భాగంగా నిర్వహిస్తున్న సమగ్ర భూ రీ సర్వేతో భూ వివాదాలకు చెక్ పడుతుందని అనకాపల్లి ఆర్డీవో చిన్ని కృష్ణ అన్నారు. సర్వేపూర్తయితే కచ్చితమైన కొలతలతో భూ వివరాలను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. మండలంలోని సబ్బవరం, అనకపల్లి గ్రామాల్లో రెవెన్యూ బృందాలు నిర్వహిస్తున్న సమగ్ర రీ సర్వేను శనివారం ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణ మాట్లాడుతూ అనేక సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఈ రీ సర్వే వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహిస్తున్న సర్వేలో కచ్చితమైన కొలతలు రికార్డుల్లో నమోదవుతాయని చెప్పారు. రైతులంతా అధికారులకు సహకరిస్తూ తమ కమతాలను దగ్గరుండి చూపించి సర్వే చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకూ పలు గ్రామాల్లో చేపట్టిన రీ సర్వే వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి కంప్యూటర్‌లో పొందుపరిచిన రీ సర్వే వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి. సత్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ వెంకట్,మండల సర్వేయర్ కర్రి శ్రీనివాసరావు,ఆర్ఐ వీరయ్య, వీఆర్వోలు శేషు,నూకరత్నం పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దు అన్యాయం

అనకాపల్లిటౌన్: రాహుల్‌గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయడం బీజేపీ సర్కార్ అవలంబిస్తున్న కక్షపూరిత చర్యలకు నిదర్శనమని రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనువాస్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్ వద్ద పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రశ్నించే నాయకుల గొంతునొక్కే చర్యలకు బీజేపీ పాల్పడుతోందని, ఇది అన్యాయమని చెప్పారు. పార్టీ పెందుర్తి నియోజకవర్గ నాయకుడు ఆడారి రమేష్, అనకాపల్లి,యలమంచిలి, చోడ వరం నియోజకవర్గాల కన్వీనర్లు ఐ.ఆర్.గంగాధర్, కూండ్రపు అప్పారావు, గూనూరు వెంకటరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు దాసరి సంతోష్ కుమార్, కశింకోట మండల పార్టీ నాయకులు కత్తెర శ్రీధర్ పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి



శంకరం గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్: జగనన్న లేఅవుట్లలో త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆర్డీవో ఎ.జె.చిన్నికృష్ణ ఆదేశించారు. మండలంలోని శంకరం గ్రామంలో జగనన్న లేఅవుట్‌ను ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్ధిదారుల గృహాలకు విద్యుత్ మీటర్లు అందజేస్తున్నామని, తాగునీటి సౌకర్యంకోసం కొత్తగా పైప్ లైన్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రస్తుతం ఐదుగురు ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి, గృహ ప్రవేశం చేసినట్టు తెలిపారు. నెల రోజుల్లో మిగిలిన ఇళ్ల పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ ఎస్.యుగంధర్, పంచాయతీ కార్యదర్శి జయలక్ష్మి, సర్పంచ్ పసుపులేటి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామనాయకుడు రామకృష్ణ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

సెయింట్ జాన్స్‌లో ఘనంగా స్నాతకోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన

కశింకోట: స్థానిక సెయింట్ జాన్స్ స్కూలులో శనివారం యూకేజీ చిన్నారులకు స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ విద్యార్థులకు ప్రమాణ పత్రాలు అందజేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బ్రెయిన్ ట్యూమర్ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్



రామకృష్ణ సోదరుడు శ్రీనుకు చెక్కు అందజేస్తున్న ఎంపీ సత్యవతి

అనకాపల్లిటౌన్: విద్య, వైద్యరంగాల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి తెలిపారు. బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న నర్సీపట్నం నియోజకవర్గం నాతవరం మండలం వెదురుపల్లి గ్రామానికి చెందిన పి.రామకృష్ణ అనే రైతుకు వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం ఫండ్ నుంచి రూ.2 లక్షలు మంజూరయ్యాయి. ఆ చెక్కును రామకృష్ణ సోదరుడు శ్రీనుకు ఎంపీ సత్యవతి అనకాపల్లిలోని తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా వైద్యఖర్చుల నిమిత్తం సాయం అందజేస్తున్నట్టు తెలిపారు.

జగనన్న లేఅవుట్ పరిశీలన



అచ్చెర్లలో లేఅవుట్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో అప్పారావు

కశింకోట:మండలంలోని అచ్చెర్లలో వైఎస్సార్ జగనన్న లే-అవుట్‌ను శనివారం ఎంపీడీవో కొంకి అప్పారావు పరిశీలించారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం తాళ్లపాలెంలో సంపద కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, అచ్చెర్ల సర్పంచ్ నిమ్మదల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు ఎన్‌ఆర్‌ఐ సాయం



విద్యార్థినికి చెక్కు అందజేస్తున్న సత్తిపండు

అనకాపల్లిటౌన్: బాలికల ఉన్నత చదువులకు ప్రవాసభారతీయురాలు ఆడారి పావనిమూర్తి తమవంతు సాయం అందించడం అభినందనీయమని జబర్దస్త్ నటుడు సత్తిపండు అన్నారు. స్థానిక ఏపీటీఎఫ్ భవనంలో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 20 మంది బాలికల ఉన్నతచదువుల నిమిత్తం రూ.90వేల చెక్కులను శనివారం ఆయన అందజేశారు. ట్రస్టు అధ్యక్షుడు ఎస్.తమ్మిరాజు మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి ప్రతి ఏటా నర్సింగ్, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొయిలాడ వెంకట్, డి.నూకేష్, ఎస్.రమేష్, బొయిన చిన్నారావు, కొణతాల సోమశేఖర్, ఎ.దక్షిణామూర్తి పాల్గొన్నారు.

రాజీవ్‌గృహకల్ప ఇళ్లకు మరమ్మతులు చేయాలని వినతి



కమిషనర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అనకాపల్లిటౌన్: స్థానిక విజయరామరాజుపేట ఏఎంసీ కాలనీలో రాజీవ్‌గృహకల్ప ఇళ్లకు మరమ్మతులు చేయాలని 83వవార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి కోరారు. ఈమేరకు విశాఖ జీవీఎంసీ కార్యాలయంలో కమిషనర్ రాజాబాబు, మేయర్ గొలగాని హరివెంకటకుమారికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ ఇళ్ల నిర్మించి 15 ఏళ్లు పూర్తికావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయని, ఇటీవల కురిసిన వర్షాలకునీరు గృహాల్లోకి ప్రవేశించిందని చెప్పారు. వార్డు పరిధిలో సులబ్‌కాంప్లెక్స్‌ల కాంట్రాక్టర్లకు బకాయిలు త్వరితగతిన చెల్లించాలంటూ వినతిపత్రంలో పేర్కొన్నారు.

విద్య, ఉపాధి అవకాశాలు పుష్కలం



మాట్లాడుతున్న జగన్నాథరావు

అనకాపల్లిటౌన్: విద్యార్థుల అభిరుచికి తగ్గట్టు విద్య, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం ఉప సంచాలకులు పి.వి.కె.జగన్నాథరావు అన్నారు. పట్టణంలో గవరపాలెం మహాత్మజ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన 10వతరగతి విద్యార్థుల వీడ్కోల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వ్యవసాయరంగంలో విద్యార్థులకు మంచి అవకాశాలున్నాయని చెప్పారు. 80వవార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కర్రి గంగాధర్, పాఠశాల ప్రిన్సిపాల్ దేవరశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

అనకాపల్లిటౌన్: క్రీడలను మన జీవితంలో ఓ భాగం చేసుకున్నప్పుడు సంపూర్ణ ఆరోగ్యంపొందవచ్చని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్యశిక్షకుడు ఎస్.సూర్యారావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ క్రీడామైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణిస్తున్నట్టు చెప్పారు. ఆసియా క్రీడల్లో పవర్ లిఫ్ట్‌లో పతకాలు సాధించిన క్రీడాకారిణులకు డి.కుసుమ, ఆర్.పూర్ణలను సత్కరించారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డు గ్రహీత పి.నిర్మల, దిశస్టేషన్ ఎస్ఐ కె.సావిత్రి, డివిజన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.దయామాధురి, వ్యాయామ మహిళా ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న గొర్లి సూరిబాబు

అనకాపల్లిటౌన్: మండలంలో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు ఎంపీపీ గొర్లి సూరిబాబు తెలిపారు. ఆయన అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ తమ పరిధిలో పరిష్కారం కాని సమస్యలను మంత్రి అమర్‌నాథ్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. వ్యవసాయాధికారి రంగాచారి మాట్లాడుతూ కౌలురైతులందరికీ ప్రభుత్వం గుర్తింపుకార్డులిస్తోందని, ముందుగా తహసీల్దార్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోలన్నారు. మండలంలో 96 మంది కౌలు రైతులకు గుర్తింపుకార్డులిచ్చినట్టు చెప్పారు. మండలంలో ఐదుగురు రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు అందజేశామని, మరో 8గ్రూపులకు ట్రాక్టర్లు అందించనున్నామన్నారు. తగరంపూడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి పావని మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ ఏప్రిల్ 6వతేదీ నుంచి పూర్తిస్థాయిలో అమలు చేయనున్నట్టు చెప్పారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ మాట్లాడుతూ వేసవిలో మండలంలో అన్ని గ్రామాల్లోను 150 హ్యాండ్‌బోర్లకు రూ.10లక్షలతో మరమ్మతులు చేపట్టినున్నట్లు చెప్పారు. 46 కాలనీల్లో త్వరలో రూ.5 కోట్లతో తాగునీటి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. వెలుగు ఏపీఎం నీలాచలం మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా నిధుల వివరాలు తెలిపారు.

ఐసీడీఎస్ ఏసీడీపీ శశికళ మాట్లాడుతూ కశింకోట, అనకాపల్లి అర్బన్, పట్టణాన్ని ఒక యూనిట్‌గా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోను గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. కొత్తూరు సర్పంచ్ ఎస్.లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనుల విషయాన్ని తమకు తెలియజేయడం లేదన్నారు. బిల్లులపై సంతకాలు చేసినప్పుడు మాత్రమే తమ దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ధర్మారావు, డీటీ వై.శ్రీరామ్మూర్తి, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, వైస్ ఎంపీపీలు విల్లూరి సూర్యకుమారి, ఐతా రాము పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం

కశింకోట: చిరు ధాన్యాలతో మంచి ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుచరిత అన్నారు. మండలంలోని ఎ.ఎస్. పేట శివారు గొబ్బూరుపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరు ధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టిక విలువలు కలిగిన ఆహారాన్ని అందివ్వాలన్నారు. చిరు ధాన్యాలు, పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఆశీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



నేవీ నిర్వాసితుల నాయకులతో ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

రాంబిల్లి: నేవీ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు తెలిపారు. నేవీ నిర్వాసితుల ఐక్య వేదిక నాయకులు శనివారం విశాఖపట్నంలో ఎమ్మెల్యేను కలిశారు. తమ డిమాండ్లు పరిష్కరిస్తే ధర్నా విరమిస్తామని నాయకులు పేర్కొన్నారు. నేవీ నిర్వాసితులు, మత్స్యకారులకు సంబంధించిన అంశంపై అసెంబ్లీలో కూడా చర్చించానని ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెప్పారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ ఉప్పలపాటి సుకుమారవర్మ పాల్గొన్నారు.